
# నిజం తెలిసింది

సి. ఆనందారామం



అద్దం ముందు నిలబడి నుదిటిపైన ఎఱ్ఱని కుంకం దిద్దుకుంటూన్న సుజాతకు చేతులు వణికాయి. కనుకొలకులలోనుండి కన్నీటిబొట్లు క్రిందకు జారకుండా రుమాలుతో చీటికీ మాటికీ తుడుచుకోవటంవల్ల కాటుక కనురెప్పలపైన చెక్కిళ్ళ క్రింద వ్యాపించి పచ్చని మొహంలో నల్లని మసక మరకలు అదొక విలక్షణంగా ఉన్నాయి. కట్టుకున్నది పట్టుచీర. పెట్టుకున్నవి బంగారు నగలు. అయినా ముఖంలో ఏదో వెలితి. అందానికి కావలసిన హంగులన్నీ ఉన్నా, అందానికి అర్థమే కోల్పోయిన ముఖకవళిక...

పనిమనిషి వచ్చి మిసెస్ వర్మా, వరలక్ష్మమ్మగారూ, సీతాకుమారీ, మిసెస్ కుమార్ మొదలైన వారంతా వచ్చారని చెప్పింది. ఒకనాడు సుజాత వీరందరి రాకకోసం ఎంతో ఉత్సుకతతో ఎదురుచూసేది. వారందరి ముందూ తన కొత్త చీరలూ, కొత్త రకాల నగలూ, ప్రదర్శించి సభ్యత కోసం వాళ్ళ పెదవులు పలికే ప్రశంసా వాక్యాల వెనుక మనసులో కదనుతొక్కే ఈర్ష్య, కళ్లలో కదలాడుతూ ఉంటే అది చూడటానికి సుజాతకీ పరమానందంగా ఉండేది. చీరలకంటే, నగలకంటే కూడా తన ఫోటో ఆల్బం వారికి చూపించడం మరీ ఇష్టం సుజాతకి.

ప్రతి సెలవులలోనూ, తనూ, సుందర్, ఏదో ఒక సుందర ప్రదేశానికి విహారయాత్రకు వెళ్లేవారు. అక్కడ సుందరం, తనూ, రకరకాల భంగిమలలో ఫోటోలు తీయించుకునేవారు. ఆ రంగుల ఫోటోలన్నీ తన ఆల్బంలో అందంగా అతికించుకునేది. ఇంచుమించు ప్రతి ఫోటోలోనూ, సుందర్ మురళి వాయిస్తూనే ఉండేవాడు. ఆ మురళీ నాదం వింటూ, తను అతని వొళ్లో తలపెట్టుకునో లేక అతని పక్కన పచ్చ గడ్డిలో పడుకునో ఉండేది. ఆ ఫోటోలు చూసి 'మా వారికి అసలు తీరుబడే ఉండదు. ఎప్పుడైనా ఎక్కడికైనా ఇలా వెళ్ళాలన్నా పడనే పడదు. ఎంత డబ్బుండీ ఏంలాభం ?' అని మిసెస్ వర్మ నిట్టూర్చినప్పుడు...

''కొంతమంది మగవాళ్లకి సొంత భార్య ఎంత అందంగా ఉన్నా, ఆ అందం కనిపించనే కనిపించదు'', అని సీతాకుమారి అక్కసుగా చూసినపుడూ...

"ఏవిటో కాలం మారిందంటారు కాని అత్తా, ఆడబిడ్డల ఆరళ్ళు తప్పించుకుని కట్టుకున్న మొగుడితో నాలుగు రోజులు కులాసాగా గడపటానికైనా లేదు'', అని సావిత్రి నొచ్చుకున్నప్పుడూ...

"ఇలా సుందర ప్రదేశాలన్నీ దర్జాగా తిరగాలంటే చాలా డబ్బుండాలి", అని మిసెస్ కుమార్ నిరాశతో క్రుంగిపోయినపుడూ...

సుజాతకి చాలా గర్వంగా ఉండేది. కాని ఈ రోజున వాళ్ళందరూ వస్తున్నారంటేనే భయంతో గుండెలు దడదడలాడుతున్నాయి. వాళ్ల ముఖాలు చూడకుండా, వాళ్ల మాటలు వినకుండా, ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తూంది.

మిసెస్ వర్మా, సీతాకుమారి ప్రభృతులంతా వచ్చి సోఫాలలో కూర్చున్నారు. సుజాత ముఖంలో నవ్వు పులుముకోడానికి శాయశక్తులా ప్రయత్నించసాగింది.

"సుందర్ వార్తలేమైనా తెలిసాయా ?" అని అడిగింది మిసెస్ వర్మ.

సుజాత నవ్వు కాని నవ్వుతో "లేదు. ఏ దూర ప్రాంతాలలో చిక్కుకుపోయారో !" అంది.

"ఏ మారుమూల ఉన్నా ఉత్తరం రాయొచ్చుగదా !" అంది సీతాకుమారి.

ఆ మాటలు వినగానే రెండు చేతుల్లో ముఖం దాచుకొని ముందుకు టేబిల్‌మీదకు వొరిగింది సుజాత.

"బాధపడకండి. చచ్చిపోయిన వాళ్ల లిస్టులో సుందర్ పేరు లేదు గదా !" అని ఓదార్చబోయింది మిసెస్ కుమార్.

"వాళ్ళకు శవాలు దొరికితేనే ఆ పేర్లు ప్రకటిస్తారు. శవాలు కూడా దొరకకపోతే ఏంచేయగలరు ?" అని దీర్ఘం తీయబోయింది సావిత్రి.

సుజాత దిగ్గున తలెత్తి "సుందర్ బతికే ఉన్నారు. క్షేమంగా ఉన్నారు. నాకు తెలుసు" అంది గట్టిగా.

సుందర్ చచ్చిపోయాడని ప్రతిపాదించడానికి వాళ్ల మనసులు ఎంత ఉబలాటపడుతున్నా అప్పటి సుజాత ఆకారాన్ని చూచి ఇంకేం మాట్లాడలేకపోయారు. మరి కొంచెంసేపు సరదాగా సానుభూతి వాక్యాలు పలికి మబ్బులు కమ్ముకున్న సుజాత ముఖాన్ని సంతృప్తిగా చూసి వెళ్ళిపోయారు.

"ఏ మారుమూల ఉన్నా ఉత్తరం రాయడూ" అన్న సీతాకుమారి మాటలు గుర్తొచ్చాయి సుజాతకి. గోద్రెజ్ బీరువా తెరిచి తను చందనపు పెట్టెలో అపురూపంగా దాచిన ఉత్తరం బయటకు తీసింది. అప్పుడే అక్షరాలు నేర్చుకుంటున్నవాడి రాతలా ఉంది ఆ దస్తూరి.

"డియర్ సుజీ,

ఈ దస్తూరీ చూసి ఎవరిదా అని ఆశ్చర్యపోతున్నావా ! నాదే. ఎడం చేతిది. మొన్ననే కుడిచేతికి గుండు దెబ్బ తగిలింది. ప్రమాదం లేదులే ! ఆపరేషన్ చేసి గుండు తీసేసారు. అయితేనేం ? మురళి వాయించుకోడానికి వీల్లేదు. రోజు మొత్తంమీద ఒక్కగంటైనా మురళి వాయించుకోకపోతే పిచ్చెత్తినట్టుగా ఉంటుంది. ఈ పరిస్థితులో మరీ మరీ నువ్వే గుర్తొస్తున్నావు. నీకు ఉత్తరమైనా రాయకుండా ఎలా ఉండగలను ? అందుకే ఎడంచేత్తో రాస్తున్నాను. అర్థం అవుతూందా ? నా దస్తూరి అర్థం అయినా కాకపోయినా, ఈ ఉత్తరంలో నీకోసం అలమటించే నా మనసు అర్థం అవుతుంది కదూ !

త్వరలో నిన్ను కలుస్తాను.

నీ

సుందర్..."

ఆ ఉత్తరం చేతిలోకి తీసుకుని చాలాసేపు దాన్నే చూస్తూ కూచుంది



సుజాత. ఆయిదారు నెలల్రకితం ఆ ఉత్తరం అందుకున్నప్పుడు దుఃఖం ఆపుకోలేకపోయింది. అయితే అంతటి దుఃఖంలోనూ ఏదో ఆనందవీచిక హృదయాన్ని పరవశింపచేసింది. కుడి చేతికి గుండుదెబ్బతగిలి మంచంలో బాధపడుతోన్న సుందర్ ని ఊహించుకుంటే గుండె చెదిరింది. అంతకుమించి మనసును మెలిపెట్టింది మురళి మ్రోగించుకోలేని స్థితిలో ఏకాంతవాసం అనుభవిస్తోన్న సుందర్ పరిస్థితి. అలాంటి సమయంలో కూడా తననే గుర్తుచేసుకుంటూ, తన స్మృతులే ఓదార్పుగా బ్రతుకుతోన్న సుందర్ అనురాగానికి ప్రతిబింబం ఆ ఎడంచేతి ఉత్తరం. అందుకే దాన్ని అంత అపురూపంగా దాచుకుంది.



ఆరేళ్ళక్రితం ఒక డిన్నరుపార్టీలో మొదటిసారిగా "సుందర్" మురళీనాదం వింది సుజాత. ఆ పార్టీలో అందరినీ ఆ మురళీనాదం సమ్మోహితుల్ని చేసింది. మురళీనాదంతోపాటు సుందర్ సుందర స్వరూపం కూడా సుజాతను పరవశింపచేసింది. తనకు పెళ్ళి సంబంధాలు చూస్తోన్న తల్లితో తన మనసులో మాట చెప్పేసింది. సుజాత ఇష్టాన్ని కాదనేవారు కారు సుజాత తలిదండ్రులు. సుందర్ ని గురించి విచారించారు. కులం, గోత్రం, చదువూ, సంస్కారం అన్నీ సరిపోయాయి గాని అతడు మిలటరీ ఆఫీసర్ అని విని కొంత తటపటాయించారు. కాని సుజాత గట్టిగా పట్టుపట్టడంతో సుందర్ తలిదండ్రుల్ని సంప్రదించి సుందర్ తో వైభవంగా వివాహం జరిపించారు. ఆ జంటను చూచిన ప్రతి ఒక్కరూ, "రతీ మన్మథుల్లా" ఉన్నారని ఆనందించారు.

పెళ్ళయ్యాక సుజాతకు కొంత కాలం జీవితం స్వర్గంలాగే కనిపించింది. ప్రతి సాయంత్రం డాబామీదనో, నదిఒడ్డునో, పూల తోటలోనో సుందర్ మురళి మ్రోగిస్తూంటే పరవశించి వినటం సుజాత దైనందిన కార్యక్రమాల్లో ముఖ్యమైనది. ఒక్కరోజు అలా వినకపోయినా ఏదో పోగొట్టుకున్నట్లే అనిపించేది సుజాతకు. వృత్తిరీత్యా సుందర్ దూరప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చినపుడుమాత్రం సుజాతకు దిన మొక యుగంగా గడిచేది. అలాంటి సమయాల్లో రోజు కొక ఉత్తరం రాసేవాడు సుందర్. ఎంతదూరంలో ఉన్నా ఏమాత్రం అవకాశం ఉన్నా ఫోన్ చేస్తుండేవాడు. సుందర్ తిరిగి వచ్చాక వియోగం తరువాత సంయోగం మరింత మధురంగా ఉండేది. రోజులు క్షణాల్లా దొర్లిపోయేవి. రెక్కలు కట్టుకుని ఏ ఆనందసీమలలోకో ఎగిరిపోతున్నట్లుగా ఉండేది. బంగ్లాదేశపు దాస్యవిమోచనకై భారతదేశం పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించింది. ఆ యుద్ధంలో పాల్గొన్న సుందర్ సమాచారం తెలియలేదు. మరణించినట్లు ప్రకటించినవారిలో సుందర్ పేరు లేదు. సుందర్ తిరిగి రాలేదు. అతని దగ్గరనుంచి ఉత్తరమూ లేదు. సుందర్ మరణించాడని అనుకోలేకపోతూంది సుజాత. బ్రతికే ఉన్నాడని ధైర్యం తెచ్చుకోలేకపోతూంది. సుమంగళిలా అలంకరించుకుంటుంది. దుర్భర విషాదాన్ని ఆ అలంకరణలో కప్పుకోలేకపోతూంది. బొట్టూ, కాటుకా ఉన్న ఆ ముఖంలో చిరునవ్వుమాత్రం కరువయ్యింది.

సుజాతకు ఆప్తమిత్రురాలు సుశీల. సుజాతను చూడడానికి వచ్చి, దయనీయమైన ఆ మూర్తిని చూసి భరించలేకపోయింది.


"సుజీ, ఇలా కొన్నాళ్ళుంటే నువ్వు పిచ్చాసుపత్రిలో చేరవలసి వస్తుందని భయంగా ఉంది. నాతో వచ్చేయి'', అంది.

సుజాత "హమ్మో నేను నీతో వచ్చేస్తే ఎలాగే ? ఏదైనా ఫోన్ కాల్ వస్తే ? ఏదైనా ఉత్తరం వస్తే ?" అంది.

సుశీలకు చాలా జాలేసింది. ఈ ప్రణయోన్మాదిని ఎన్ని సంవత్సరాలు ఇలాగ ఉత్తరంకోసమో, 'ఫోన్ కాల్ కోసమో ఎదురుచూస్తూ, ఇల్లు కదలకుండా కూచుని మతి పోగొట్టుకుంటుంది ?

"సుజీ ! మా శ్రీవారు ఉద్యోగరీత్యా భద్రాచలం ప్రాంతాల్లో ఉన్న ట్రైబల్ ఏరియాస్‌కి వెళుతున్నారు. భద్రాచలం దగ్గర కదా ! శ్రీరామచంద్ర మూర్తి దర్శనం చేసుకుందామని నేనూ బయలుదేరుతున్నాను. నువ్వూ రా ! ఆ శ్రీరాముడి దయవల్ల నీ సుందర్ త్వరలో తిరిగి క్షేమంగా రావాలని భద్రాద్రి రామునకు నమస్కారం చేసుకో ! మూడే మూడు రోజుల్లో తిరిగి వచ్చేద్దాం. బయలుదేరు", అంటూ సుజాతను బలవంతపెట్టి బయలుదేరదీసింది సుశీల.

సుశీల దంపతులతో సుజాత కూడా భద్రాద్రికి బయలుదేరింది. దేవుడు, పూజలు అంటే ఏనాడూ అంత శ్రద్ధ చూపించని సుజాత సుందర్‌ని కాపాడమని భద్రాద్రి రాముణ్ణి చేతులు జోడించి ప్రార్థించింది. దైవదర్శనం




అయ్యాక ముగ్గురూ కాలక్షేపంగా కొండప్రాంతాలలో ఆదిమవాసుల్ని చూట్టానికి బయలుదేరారు. అన్యమనస్కంగా నడుస్తోన్న సుజాత చటుక్కున ఆగిపోయింది. సుశీల తెల్లబోయి అదేం అలా నిలబడిపోయావు ? అంది. సుజాత మాట్లాడలేదు. చేష్టలుడిగిన బొమ్మలా నిలబడే ఉండిపోయింది.

సుశీల ఆశ్చర్యంగా "అరె ! ఆ మురళీనాదం ... మన సుందర్ మురళీ వాయిద్యంలా లేదూ ?" అని ముందుకు నడవబోయింది. సుజాత గభాలున సుశీల చెయ్యి గట్టిగా పట్టుకుంది. కనుచూపుమేర దూరంలో అటు తిరిగి ఒక యువకుడు మురళి వాయిస్తున్నాడు. ఎవరో యువతి అతని మోకాళ్ళపై తల ఆనించి పారవశ్యంతో మురళీనాదం వింటోంది.

"సుశీలా ! ఇంటికి పోదాం పద " అంది సుజాత.

''ఆ మురళి వాయిస్తున్నది మన సుందర్ అని నాకు అనుమానంగా ఉంది. చూద్దాం రా !''

''కాదు ! ... కాదు ! ... కాదు ! ఎంతమాత్రం కాదు ... చూడవలసిన అవసరమేం లేదు. పోదాం పద.''

సుజాత, సుశీల చెయ్యిపట్టుకుని బరబరా అక్కణ్ణించి ఈడ్చుకుపోయింది.

మిసెస్ వర్మ, సీతాకుమారీ, సావిత్రీ, మిసెస్ కుమార్ మొదలయిన వాళ్ళంతా ఎప్పటిలా సుజాత ఇంటికి వచ్చారు. సుజాతను చూసి నిర్ఘాంతపోయారు. బొట్టూ, కాటుకా లేకుండా ఒంటిమీద ఒక్క నగ లేకుండా తెల్లచీరలో కనిపించింది సుజాత.

''అయ్యో ! సుజాతా ! ఏమిటీ ఘోరం ?" అని గుండె బాదుకుంది మిసెస్ వర్మ.

''విధి నెవరు తప్పించగలరు ?'' అంది నిర్లిప్తంగా సుజాత.

''సుందర్ సమాచారం తెలిసిందా ?" కుతూహలంగా అడిగింది సావిత్రి !

"నాకు నిజం తెలిసింది. ఇంక సుందర్ నాకు లేడు", విరాగిణిలా నవ్వింది సుజాత.